క్లుప్తంగా

అన్నింటా శ్రీకృష్ణతత్వమే



నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్‌లో సంకీర్తనలు ఆలపిస్తున్న భక్త బృందం

అయినవిల్లి: ఇందుగలడు అందులేడని సందేహం వలదు.. ఎందెందు చూసిన అందందే గలడు కృష్ణుడు అని, అన్నింటా శ్రీకృష్ణుడి తత్వమేనని ఎంత చెప్పిన ఆయన తత్వం బోధపడదని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకులు సుందర శ్రీనివాసదాస్ ప్రభుజీ అన్నారు. ఆదివారం శ్రీకృష్ణుని తత్వాన్ని శ్రీనివాసదాస్ ప్రభుజీ ప్రబోధించారు. కష్టాలు, సుఖాల్లోను అన్నింటా ఆయనే నన్నారు. భక్తులకు ఆపద వస్తే అక్కడే శ్రీకృష్ణుడు కొలువై కాపాడతాడన్నారు. ఆయనే అన్ని అన్నారు. అనంతరం భక్త బృందం ఆధ్వర్యంలో శ్రీకృష్ణునికి విశేష పూజలు జరిపారు. సంకీర్తనలు ఆలపించి తన్మయత్వం చెందారు. సాయంత్రం శ్రీకృష్ణునికి పల్లకీ సేవ చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

మంత్రిని కలిసిన డిజిటల్ అసిస్టెంట్లు



మంత్రి సుభాష్‌ను కలసిన డిజిటల్ అసిస్టెంట్లు

అయినవిల్లి: పంచాయతీ సెక్రటరీ గ్రేడ్ 6 (డిజిటల్ అసిస్టెంట్) యూనియన్ సభ్యులు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను అమలాపురంలోని ఆయన స్వగృహంలో ఆదివారం కలసి వినతిపత్రం అందజేశారు. సచివాలయంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రమోషన్ చానల్, పే స్కేల్ అన్నింటికంటే ముఖ్యంగా వీరికి ఉన్న ఉన్నతమైన టెక్నికల్ క్వాలిఫికేషన్స్ దృష్ట్యా రాష్ట్రంలో ఉన్న 35 ప్రభుత్వ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్ లుగా పదోన్నతి కల్పించాలని కోరారు. అలాగే అర్హత కలిగిన వారిని విద్యా శాఖలో కంప్యూటర్ టీచర్లుగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా యూనియన్ ప్రెసిడెంట్ కొండా నాగ వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు జగడం కిరణ్, రామోజీ, అడ్డగళ్ల శ్రీను, కడలి సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిని అభివృద్ధి చేయండి



ఇసుకపూడిలో అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి

అంబాజీపేట: ఇసుకపూడి గ్రామానికి వచ్చే ప్రధాన రహదారి శిథిలమై అధ్వానంగా ఉంది దానిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ రహదారిలో గుంటలు ఏర్పడి నడిచేందుకు వీలు లేకుండా ప్రమాదకరంగా మారింది. కొద్దిపాటి వర్షానికే రహదారి చిత్తడిగా మారడంతో అటుగా వెళ్లే పాఠశాల విద్యార్థులు, చిన్నారులు, వృద్ధులు, రైతులు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డులో ద్విచక్ర, సైకిలిస్టులు ప్రయాణించి ప్రమాదాల బారిన పడ్డారన్నారు. రహదారిని అభివృద్ధి చేస్తామని నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చి గాలికొదిలేశారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామానికి వచ్చే ప్రధాన రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

అన్నదానం ట్రస్టుకు రూ.10,116 విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు పెదపట్నంలంకకు చెందిన కొమ్ముల జగ్గారావు స్మారకార్థం అతని సతీమణి కొమ్ముల వెంకటలక్ష్మీ మంగతాయారు వారి కుటుంబ సభ్యులు ఆదివారం రూ.10,116 విరాళంగా అందించారు. ఈ మొత్తాన్ని ఆలయ ఉద్యోగులకు అందజేశారు. విరాళం అందించిన దాతకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.



జగ్గారావు కుటుంబ సభ్యులకు స్వామి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఉద్యోగులు

సరిలేరు మీకెవ్వరూ..

- వాయువేగంతో వరినాట్లు
- బెంగాలీల వైపు రైతుల చూపు
- తక్కువ సమయం–పెట్టుబడి ఆదా
- నారు ఆదా.. తెగుళ్ల బెడద తక్కువ



పెదపళ్లలో వరినాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

ఆలమూరు: వరిసాగులో అన్నదాతలను కూలీల కొరత విపరీతంగా వేధిస్తుంది. దీనివల్ల నిర్ణీత సమయానికి వరినాట్లు వేయకపోవడంతో తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది. గతంలో స్థానిక కూలీలైతే ఆకుతీతకు మగవారిని, వరినాట్లు వేయడానికి ఆడ కూలీలను వినియోగించుకునే నారుమళ్ల ప్రక్రియను పూర్తి చేసేవారు. ప్రస్తుత పరిస్థితుల్లో కూలీల కొరత వేధిస్తున్న దృష్ట్యా రైతులు ప్రత్యామ్నాయ మార్గాల వైపు దృష్టి సారించారు. ఆ సమయంలో స్థానిక రైతాంగానికి బెంగాలీ కూలీలు వరంగా మారారు. గత ఐదేళ్ల నుంచి బెంగాలీ కూలీలు చక్కని నేర్పరితనంతో సమయాన్ని, పెట్టుబడిని ఆదా చేస్తూ ఆకుతీత నుంచి వరినాట్లు వరకూ పనులు చేస్తూ రైతులను ఆకట్టుకుంటున్నారు.

క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లో ఆకుతీత, వరినాట్లు సీజన్ ఊపందుకుంది. పశ్చిమ బంగాలో అనుసరించే వరిసాగు పద్ధతిని ఇక్కడ రైతులు కూడా అదే రీతిలో అవలంబిస్తున్నారు. దీంతో బెంగాలీ కూలీల సంఖ్య ఏటా పెరుగుతూ వస్తుంది. దానికనుగుణంగా స్థానిక రైతులు వ్యవసాయ పనులు అప్పగిస్తున్నారు. క్లస్టర్ పరిధిలోని మూడు నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో సుమారు 28,500 ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు, అందులో సుమారు 70 శాత మేర నారుమడులకు బెంగాలీ కూలీలను వినియోగించే పరిస్థితి ఏర్పడింది. బెంగాలీ పద్ధతుల మాదిరిగా వేసే నాట్ల పద్ధతి వల్ల పంటకు తెగుళ్ల బెడద తగ్గడంతో పెట్టుబడులు కూడా ఆదా అవుతుండటంతో రైతులు బెంగాలీ కూలీల వైపే ఆసక్తి కనబరుస్తున్నారు. పలు గ్రామాల్లో వరినాట్లు వేసేందుకు వచ్చే బెంగాలీ కూలీలకు స్థానిక రైతులు స్థావరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక వసతులు సమకూర్చుతున్నారు. దీనివల్ల ఆ బెంగాలీ కూలీలు జట్లు జట్లుగా పనులు చేసేందుకు ఒప్పందం చేసుకుని మెరుగైన పనితీరును కనబరుస్తూ రైతులను ఆకర్షిస్తున్నారు. ఈ కార్మికులు రోజంతా పనిచేయకుండా కేవలం తెల్లవారుజామున పనులు ప్రారంభించి మధ్యాహ్నానికే ముగించుకుని వెళ్లడం ప్రత్యేకత సంతరించుకుంటుంది. సాయంకాలం సేద తీరడంతో పాటు అవసరమైన వంటకాలు చేసుకుని హాయిగా జీవనం గడుపుతున్నారు.

ఎకరాకు నలుగురు కూలీలే అవసరం

ఎకరా పొలానికి వరినాట్లు వేసేందుకు సాధారణంగా కూలీలు ఆరుగురు అవసరం కాగా బెంగాలీ కూలీలు నలుగురు మాత్రమే ఉండి అనుకున్న గడువు మేరకు పని పూర్తి చేసుకుని వెళుతున్నారు. అలాగే బెంగాలీ కూలీలు తమ వద్ద ఉన్న ప్రత్యేక పరికరం ద్వారా తాము చేసిన పనిని సెంట్లతో సహా కొలతలు చేసి కచ్చితంగా కొలుచుకుంటారు.. దానికనుగుణంగా ఒప్పందం పద్ధ కూలీని తీసుకుంటారు. దీంతో ఖర్చు గణనీయంగా తగ్గడంతో పాటు, దిగుబడుల్లో భారీ వ్యత్యాసం కనబడుతుంది. సాధారణంగా స్థానిక కూలీలతో పూర్తి చేసిన ఆకుమడులు అందుబాటులోకి వచ్చాక ఆకుతీత, వరినాట్లు వేసేందుకు ఎకరాకు రూ.పది వేలు ఖర్చవుతుంది. అయితే బెంగాలీ కూలీలు మాత్రం ఎకరాకు రూ.నాలుగు వేలు మాత్రమే కూలి పనులుగా తీసుకుంటున్నారు. బెంగాలీ కూలీలతో చేయించుకున్న పనుల వల్ల ఎకరానికి ఐదు బస్తాల వరకూ దిగుబడులు అదనంగా వస్తోందని రైతులు చెబుతున్నారు. వరిసాగు ఖర్చు సుమారు రూ.ఆరు వేల వరకు తగ్గుతోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బెంగాలీ కూలీల పనుల్లో ప్రత్యేకత

స్థానిక వ్యవసాయ కూలీల కన్నా బెంగాలీలు వరినాట్లు వేగంగా వేయడంతో పాటు సమ దూరంలో వరినాట్లు వేయడం వల్ల వరి నారు ఆదా అవుతుంది. దీనివల్ల ఖర్చు తగ్గడంతో పాటు ఆశాజనకమైన దిగుబడులు రావడంతో రైతులు వారిపై మక్కువ చూపుతున్నారు. వరిసాగులో తక్కువ నారును ఉపయోగించి అధిక దిగుబడులు సాధించాలన్న ప్రచారానికి తగ్గట్టుగా బెంగాలీలు నాట్లు వేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. వరిసాగులో గతంలో రైతులు ఎకరానికి 25 కిలోల విత్తనాలు నారు కోసం వినియోగించేవారు. బెంగాలీ కూలీల రాకతో ఎకరానికి 15 నుంచి 20 కిలోల విత్తనాలు మాత్రమే వినియోగిస్తున్నారు. స్థానిక కూలీలు 30 రోజుల వయస్సు గల నారును మాత్రమే నాట్లు వేసేందుకు వినియోగిస్తారు. బెంగాలీలు కేవలం 15 నుంచి 20 రోజుల వయస్సు గల నారుతో నాట్లు వేసేస్తున్నారు. అలాగే బెంగాలీలు వేసిన నాట్లు నాలుగైదు రోజుల సమయానికి మూనలుగా తిరుగుతుంటే, స్థానికుల కూలీలు వేసిన నాట్లకు సుమారు పది రోజులు పడుతుంది. స్థానిక కూలీలు ఎకరాకు సుమారు 45 పోగులకు పైగా వినియోగిస్తుంటే అదే పొలానికి బెంగాలీలు 15 నుంచి 20 పోగులు మాత్రమే వాడుతున్నారు.

బెంగాలీల వైపే రైతుల ఆసక్తి



వరిసాగులో బెంగాలీలు అవలంభిస్తున్న పద్ధతుల మాదిరిగానే స్థానిక ధనిక రైతులు కూడా వరి సాగు చేస్తున్నారు. దీనివల్ల స్థానిక రైతులు బెంగాలీ కూలీల వైపే ఆసక్తి చూపుతున్నారు. అలాగే అధిక శాతం రైతులు వెదజల్లు విధానానికే మొగ్గు చూపుతున్నారు. సాధారణ పద్ధతిలో వరినాట్లు వేసే రైతుల్లో ఎప్పటికప్పుడు వ్యవసాయశాఖ సూచనలు పాటించాలి.

– ఎస్.లక్ష్మీలావణ్య, ఏఓ, ఆలమూరు

త్వరితగతిన వరినాట్లు



ఈ ఏడాది త్వరగా ఖరీఫ్ పనులు ప్రారంభించాం. గత కొన్నేళ్లుగా కౌలు వ్యవసాయం చేస్తున్నాను. బెంగాలీ కూలీలతో వరినాట్లు వేయించడానికే ప్రాధాన్యమిస్తున్నాం. వారు ఊడ్పు యంత్రం తరహాలో నాట్లు వేశారు. దీనివల్ల ఖర్చు తగ్గింది. చీడపీడల బెడద తగ్గింది. ఎకరానికి ఐదు బస్తాల ధాన్యం దిగుబడి పెరిగింది.

– శీలం వెంకటేశ్వర్లు, కౌలురైతు, పినపళ్ల

ప్రణామం విఘ్నేశ్వరా..



విఘ్నేశ్వరస్వామికి హోమ పూజల్లో పాల్గొన్న భక్తులు

అయినవిల్లి: భజే గణనాయకా.. ప్రణామం. తొలి పూజలందుకునే దేవా సర్వశుభాలు కలిగించు అంటూ ఆ స్వామిని భక్తులు మనసారా స్మరించారు. ఆదివారం సెలవు దినం కావడంతో అయినవిల్లి విఘ్నేశ్వరుని క్షేత్రం భక్తులతో శోభిల్లింది. ఉదయమే ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి మేలుకొలుపు సేవ, వివిధ పూజలు చేశారు. అలాగే సంకటహర చతుర్థి పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. స్వామివారి లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 34 మంది, లక్ష్మీగణపతి హోమంలో 23 మంది, పంచామృతాభిషేకాల్లో ఒక జంట పాల్గొన్నారు. 38 మంది నూతన వాహన పూజలు, 18 మంది చిన్నారులకు నామకరణలు, అక్షరాభ్యాసాలు జరిపారు. తొమ్మిది మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారి అన్నదాన పథకంలో 1,884 మంది అన్నప్రసాదం స్వీకరించారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.3,06,874 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు.

ఘనంగా వ్యాస పూర్ణిమ

మలికిపురం: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆషాఢపూర్ణిమ (వ్యాస పూర్ణిమ) సందర్భంగా నిర్వహించే గురుపూజా కార్యక్రమాన్ని ఆదివారం గూడపల్లిలోని ఉమామహేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు పాల్గొని వ్యాస పూర్ణిమ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో దూది సాయిబాబు, సుందర బ్రహ్మయ్య, అడబాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల జాతర

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంక గ్రామదేవతలైన కనకదుర్గమ్మ, బూరుగులమ్మ, మారమ్మ తల్లుల తీర్థం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి గ్రామస్తులతో పాటు దూరప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో బుట్టబొమ్మలు, శక్తి వేషాలు, గరగలు డ్యాన్స్‌లతో పాటు శివకోటిపాలెం గ్రామానికి చెందిన గెద్దాడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమీప గ్రామాల చిన్నపిల్లలుతో ఏర్పాటు చేసిన కోలాటానికి విశేష స్పందన లభించింది. అలాగే అమ్మవారి వేషధారణలో గెద్దాడ వైష్ణవిదుర్గ ప్రదర్శన ఆకట్టుకుంది.

రోడ్డు మరమ్మతులకు శ్రీకారం

ఆలమూరు: కొత్తూరు–వెదురుమూడి రోడ్డు మరమ్మతులకు ఆర్‌అండ్‌బీ శాఖ శ్రీకారం చుట్టింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఐదు కిలోమీటర్ల మేర ఉన్న ఈ రోడ్డు తీవ్రంగా దెబ్బతింది. దీనిపై పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు ఎట్టకేలకు స్పందించారు. తొలిదశలో జేసీబీల సాయంతో ఎగుడు దిగుడులను సరిదిద్దారు. వర్షాలు తగ్గిన వెంటనే రోడ్డు మరమ్మతులు పూర్తి స్థాయిలో చేపడతామని ఇన్‌చార్జి ఏఈ సూర్యనారాయణ ఆదివారం విలేకరులకు తెలిపారు.

చోరీ కేసులో ముద్దాయి అరెస్ట్

రావులపాలెం: కిరణా షాపు చోరీ చేసిన ఘటనలో ఒక ముద్దాయిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.1,40,000 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రేమ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈనెల మూడో తేదీన మండలంలోని గోపాలపురం గ్రామంలో ఒక కిరాణా షాపులో చోరీచేసిన ఘటనపై షాపు యజమాని కంకటాల వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. దీనిపై పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం చింతపల్లి గ్రామానికి చెందిన కండవల్లి సీతారాముడు అనే ముద్దాయిని ఆదివారం స్థానిక బస్టాండ్‌లో అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.లక్షా నలభై వేలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ముద్దాయిని కొత్తపేట కోర్టులో హాజరు పరిచామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

అంబాజీపేట: మండలంలోని నందంపూడి పంచాయతీ పరిధిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పుల్లేటికుర్రు శివారు కొల్లివారిపేటకు చెందిన 40 ఏళ్ల వ్యక్తి తన బైక్‌పై కొల్లివారిపేట నుంచి నందంపూడి మీదుగా ముంజవరం వెళుతున్నాడు. నందంపూడి సిమెంటు రోడ్డు మధ్యలో భారీ గోతులు ఏర్పడ్డాయి. ఆ గోతిలో బైక్ పడడంతో ముందుకు పడిపోయాడని స్థానికులు తెలిపారు. గాయాల పాలైన వ్యక్తిని 108లో అమలాపురం ఆస్పత్రికి తరలించారు.

కృష్ణమాదిగ పోరాటం స్ఫూర్తిదాయకం



అంబాజీపేటలో కేకును కట్ చేస్తున్న నాయకులు



మామిడికుదురులో కేకును కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అంబాజీపేట: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పోరాటం స్ఫూర్తిదాయకమైనదని పలువురు వక్తలు అన్నారు. అంబాజీపేటలో మందకృష్ణ మాదిగ పుట్టినరోజు, ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించారు. మండల దండోరా యువత ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దిగుమర్తి చిట్టిబాబు అధ్యక్షతన కేకును కట్ చేసి, బాణసంచాను కాల్చారు. కార్యక్రమంలో గణపతి వీరరాఘవులు, కొల్లి సుధాకర్, ఉందుర్తి నాగబాబు, దాసరి వీవీ సత్యనారాయణ, కొర్లపాటి గోపి, బొంతు పెదబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, దొమ్మేటి సాయికృష్ణ, మైపాల తాతాజీ, రవణం రాము, పెదపూడి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ ముసూడి నాగప్రభాకర్ అధ్యక్షతన మామిడికుదురులో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధికార ప్రతినిధి నూటికుర్తి సత్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం వల్ల బడుగు, బలహీన వర్గాలకు, వికలాంగులకు, వయో వృద్ధులకు, వితంతువులకు మేలు జరిగిందన్నారు. అనంతరం కృష్ణమాదిగ పుట్టినరోజు కేకు కట్ చేసి అభిమానులకు పంచారు. కార్యక్రమంలో జాలెం శ్రీనివాసరాజు, తొత్తరమూడి శ్రీను, చేట్ల నాగేశ్వరరావు, చేట్ల ధనమయ్య, బత్తుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇరుసుమండలో పేదలకు అన్నవితరణ



ఇరుసుమండలో అన్నసమారాధన చేస్తున్న సతీష్

అంబాజీపేట: మండలంలోని ఇరుసుమండలో పేదలకు అన్నవితరణ గావించారు. రాష్ట్రంలోని పేదల ఆకలి తీర్చేందుకు డొక్కా సీతమ్మ క్యాంటీన్లను ఏర్పాటు చేసి వాటికి ప్రాచుర్యం కల్పిస్తామని ప్రభుత్వం పేర్కొనడంపై కోనసీమ ఆహార నిధి అధ్యక్షుడు వీరంశెట్టి సతీష్ హర్షం వ్యక్తం చేశారు. సతీష్ మాట్లాడుతూ 2018లో సీతమ్మ స్ఫూర్తితో మీరు మేము కలుద్దాం..అన్నార్తుల ఆకలి తీరుద్దాం అనే నినాదంతో కోనసీమ ఆహార నిధి ఏర్పాటు చేశామన్నారు. తొలుత లంకల గన్నవరంలోని సీతమ్మ ఇంటిని ఆహారనిధి బృందం సందర్శించి, డొక్కా సీతమ్మ వారధి వద్ద ఉన్న సీతమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే ఇరుసుమండలో కోనసీమ ఆహారనిధి బృందం, డొక్కా సీతమ్మ ఐదోతరం వారసుడు డొక్కా భీమ శంకర కామేశ్వరరావు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఆదివారం కృతజ్ఞాభివందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆహారనిధి సభ్యులు గట్టెం వీరు, బండారు సురేష్, పోలిశెట్టి పవన్ మహేష్, రంకిరెడ్డి పండు, బ్రహ్మాజీ, శ్రీనివాస్, చీకట్ల కిరణ్, ఆర్‌కే నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస్ నగేష్

మలికిపురం: మండలంలోని కేశనపల్లిలో అడబాల రాంబాబు ఇంటి వద్ద మలికిపురం మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు కాపిశెట్టి కనకేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్ మాట్లాడుతూ అనేక కేంద్ర పథకాలు మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడంతో నత్తనడకన నడిచాయని పేర్కొన్నారు. రైల్వే ప్రాజెక్టుకు 25 శాతం, జల్‌జీవన్ మిషన్‌కు 50 శాతం నిధులు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, రోడ్ల నిర్మాణాలకు ఎన్డీఏ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి నిర్మాణాలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాల అమల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వేగవంతంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలలో ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలని ఏర్పాటు చేసి ప్రధానమంత్రి చిత్రపటాన్ని ఏర్పాటు చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే ప్రధానమంత్రి చిత్రపటాన్ని కూడా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, ప్రధాన కార్యదర్శి అడబాల నరసింహారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకన్న బాబు, రేకపల్లి కనకం ఏడిది వంశీ తదితరులు పాల్గొన్నారు.

కోనసీమ చరిత్రలో కళాకు సుస్థిర స్థానం



పలివెలలో కళా వెంకట్రావుకు నివాళులర్పిస్తున్న వెంకటేశ్వర్లు తదితరులు



రావులపాలెం కళా వెంకట్రావు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉప సర్పంచ్ మునిరెడ్డి, ఇతర నాయకులు

కొత్తపేట: గౌతమి–వశిష్ట గోదావరుపై వారధులు నిర్మించడం ద్వారా కళా వెంకట్రావు కోనసీమ చరిత్రలో సుస్థిర స్థానం పొందారని మహాత్మాగాంధీ అధ్యయన సంస్థ వ్యవస్థాపకుడు దుళ్ల వెంకటేశ్వర్లు అన్నారు. కోనసీమ రూపశిల్పిగా ప్రసిద్ధి చెందిన మాజీ మంత్రి కళా వెంకట్రావు జయంతిని గాంధీ అధ్యయన సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలివెల జాతీయ నాయకుల కూడలి వద్ద కళా వెంకట్రావు విగ్రహానికి సంస్థ వ్యవస్థాపకుడు దుళ్ల వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పలివెల ఉమా కొప్పేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్లు భమిడిపాటి దుర్గాలక్ష్మీనారాయణ, గొలకోటి శ్రీనివాస్, స్థానిక ఈవని రామచంద్ర పెట్రోఫిల్ మేనేజర్ విన్నకోట రాఘవేంద్రరావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రావులపాలెం: మాజీ మంత్రి కళా వెంకట్రావు కోనసీమ ప్రాంతానికి చేసిన సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తులు కొనియాడారు. ఆదివారం కళా వెంకట్రావు జయంతి సందర్భంగా ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, వార్డు సభ్యులు వెలగల సత్యనారాయణరెడ్డి, సఖినేటి వాకులరాజు తదితరులు స్థానిక హైవే సెంటరులో ఉన్న కళా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ట్యాక్స్ కట్టని బస్సులకు రూ.11 లక్షల అపరాధ రుసుం



రావులపాలెం ఆర్టీసీ డిపోలో ఉంచిన సీజ్ చేసిన బస్సులతో ఎంవీఐ అధికారులు

రావులపాలెం: వాహనదారులు వాహనాలకు ఉండాల్సిన అనుమతులు, నిబంధనలు కచ్చితంగా పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్ అన్నారు. స్థానిక జాతీయ రహదారిపై ఆదివారం నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో భాగంగా పలు కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నుంచి వచ్చే వాహనాలు తనిఖీ చేయగా ఆల్ ఇండియా పర్మిట్ టాక్స్ కట్టలేని నాలుగు బస్సులను సీజ్ చేశామన్నారు. ఆ బస్సులను రావులపాలెం ఆర్టీసీ డిపోలో ఉంచామన్నారు. వీటిపై రూ.11 లక్షలు అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. హెవీ గూడ్స్ వెహికల్స్ పై ఓవర్ లోడ్లు, ఆటోలు, క్యాబ్లు, ద్విచక్ర వాహనాలపై లైసెన్సు, హెల్మెట్ ధరించని వారిని తనిఖీ చేసి మరో రూ.లక్ష అపరాధ రుసుం విధించామన్నారు. తనిఖీల్లో భాగంగా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేవీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలో పూడిక తొలగింపు



జి.పెదపూడిలో రవిరాజు ఆధ్వర్యంలో పంట కాలువలో పూడిక తొలగిస్తున్న దృశ్యం

పి.గన్నవరం: మండలంలోని జి.పెదపూడి గ్రామంలో వైఎస్సార్ సీపీ జిల్లా వాణిజ్య విభాగం నాయకుడు మంతెన రవిరాజు ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా పంట కాలువలో పూడికతీత పనులు నిర్వహిస్తున్నారు. జి.పెదపూడి గ్రామం నుంచి గోరింకల డ్రెయిన్ వరకూ సుమారు 2 కిలోమీటర్ల పొడవునా పంట కాలువలో పూడిక పేరుకు పోయింది. దీంతో పంట చేలల్లోకి సాగునీరు వెళ్లడం లేదు. అలాగే వర్షాలకు చేల నుంచి ముంపు నీరు దిగకపోవడంతో పంటలు పాడవుతున్నాయి. ఈ విషయాన్ని రైతులు వైఎస్సార్ సీపీ నేత రవిరాజు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో రవిరాజు తన సొంత ఖర్చులతో జేసీబీ ఏర్పాటు చేసి గత నాలుగు రోజులుగా పంట కాలువలో పూడిక తొలగింపు పనులు నిర్వహిస్తున్నారు. మరో రెండు రోజుల్లో పనులు పూర్తవుతాయని ఆయన తెలిపారు. రైతుల సమస్యను పరిష్కరించిన రవిరాజును రైతులు అభినందించారు.

మొహర్రం సంతాప దినాలు ప్రారంభం

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం, మహ్మద్ ప్రవక్త మనమడు హజరత్ ఇమామ్ హుస్సేన్ అతని పరివారం అమరత్వం పొందిన దినాలను పురస్కరించుకుని నిర్వహించే సంతాప దినాలు ఆదివారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. ప్రారంభ సూచకంగా మామిడికుదురు, నగరం తదితర గ్రామాల్లో దివిటీలు వెలిగించి హై జోష్, హైజోష్ అంటూ ఇమామ్ హుస్సేన్ పరివారానికి నివాళులర్పించారు. హరం సంతాప దినాల్లో భాగంగా 10 రోజులు పీర్లు, గుమ్మటాలను ఊరేగిస్తారు. మత ప్రబోధకుడు మహ్మద్ అలీ జాఫరి మజ్లిస్ ఆలపించారు. అంజుమనే హుస్సేనియా సంఘం మొహరం కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వీధి లైట్లు వెలిగించండి

అంబాజీపేట: మాచవరం పంచాయతీ పరిధిలోని రెండు, మూడు వార్డుల్లో వీధి లైట్లు గత కొంతకాలంగా వెలగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీధి లైట్లు వెలిగించాలని అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ రెండు వార్డుల్లోను వీధిలైట్లు లేకపోవడం వల్ల చీకటి రాజ్యమేలుతుందని, దాంతో శునకాలు, విషపురుగుల బెడద ఎక్కువగా ఉందన్నారు. పంచాయతీ అధికారులు స్పందించి తక్షణమే వీధి లైన్ లోను వెలిగించాలని రెండు, మూడు వార్డు ప్రజలు కోరుతున్నారు.